సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 19 । మార్చి । 2023



తీరంలో గంజాయి కలకలం

నరసాపురం: నరసాపురంలో మరోసారి గంజాయి కలకలం రేగింది. నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి 23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



ఆక్వాకు వరుణుడి దెబ్బ

కైకలూరు: వాతావరణ మార్పు, వర్షాలతో చెరువుల్లో ఆక్సిజన్ శాతం తగ్గిపోతోందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. 8లో ▸



తాగునీటి సరఫరాకు చర్యలు

ఏలూరు మెట్రో: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. 8లో ▸



● సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీలుగా గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ శనివారం అమరావతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీలుగా నిర్మాణాత్మకమైన బాధ్యతలను నిర్వహిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవ రత్నాల పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా, ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్ వారికి సూచించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, హోంశాఖ మంత్రి తానేటి వనిత, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్యేలు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, తలారి వెంకట్రావు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. అలాగే శాసనమండలి కార్యాలయంలో చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును ఎమ్మెల్సీలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

– పాలకొల్లు అర్బన్/తణుకు టౌన్

వేసవిలో దాహార్తికి చెక్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు తాగునీటి ఎద్దడిని అధిగమించే దిశగా అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఇప్పటికే తాగునీటి చెరువులను నీటితో నింపగా, బోర్లు, పైప్‌లైన్లు, చేతిపంపులకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకోసం రెండు జిల్లాల్లోనూ రూ.ఐదు కోట్లతో పనులు నిర్వహించనున్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- రూ.5 కోట్లతో బోర్లు, చేతిపంపులు, పైప్‌లైన్లకు మరమ్మతులు
- ఇప్పటికే 70 శాతం చెరువుల్లో పూర్తి స్థాయిలో తాగునీరు

ఏలూరు (మెట్రో): వేసవిలో తాగునీటి సమస్య అధికంగా మెట్ట ప్రాంతంలో తలెత్తే అవకాశం ఉండనుండటంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఏలూరు జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయా గ్రామాల పరిధిలో ముందుగా తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత, పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. అలాగే మూతపడిన ఆర్‌వో ప్లాంట్ లను తెరిపించి వాటి ద్వారా తాగునీటిని అందించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 122 బోర్లకు మరమ్మతులు చేసి దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా గ్రామాల్లో మూగజీవాలకు సైతం తాగునీరు అందుబాటులో ఉంచేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయనున్నారు. 269 మంచినీటి చెరువులకు గాను ఇప్పటికే 228 చెరువులను నీటితో నింపారు. అదేవిధంగా నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉండే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోనున్నారు.



గణపవరంలోని మంచినీటి చెరువులో పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న దృశ్యం

పశ్చిమగోదావరి జిల్లాలో..

డెల్టా ప్రాంతమైన పశ్చిమగోదావరి జిల్లాలో 20 తాగునీటి చెరువులను ఇప్పటికే పూర్తి స్థాయిలో నీటిని నింపారు. ఆయా చెరువులకు అనుబంధంగా ఉన్న ట్యాంకులను పరిశుభ్రపరిచి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర విపత్తుల శాఖ సూచనలు మేరకు ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగరపాలక, పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మంచినీటి వనరులను వేసవిలో పూర్తి స్థాయిలో ఉపయోగించుకునేలా కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా పంచాయతీ, గ్రామీణ నీటిసరఫరా, నీటిపారుదల, జిల్లా పరిషత్, మున్సిపల్ శాఖలు, అదేవిధంగా వ్యవసాయశాఖ, విద్యుత్ శాఖ, డ్వామా శాఖల సమన్వయంతో ఎటువంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. దీనిలో భాగంగా రెండు జిల్లాల్లో రూ.5 కోట్ల నిధులను కేటాయించి, తాగునీటి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోనున్నారు.

ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం



ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఉన్న తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపాం. రానున్న రోజుల్లో తాగునీటి కొరత సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ



ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే జిల్లాలో ఉన్న మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపేలా చర్యలు తీసుకున్నాం. వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

అక్రమ లేఅవుట్లకు అనుమతులిస్తే చర్యలు

ఇన్‌చార్జి జేసీ ఎం. సూర్యతేజ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో అక్రమ లేఅవుట్లు ప్రోత్సహించినా, అనుమతులు ఇచ్చినా సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని ఇన్‌చార్జి జిల్లా జాయింటు కలెక్టరు ఎం.సూర్యతేజ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ నుంచి మునిసిపల్ కమిషనర్లు, ఈఓపీఆర్‌డీలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో అక్రమ లేఅవుట్లపై 220 ఫిర్యాదులు స్పందన కార్యక్రమంలో అందాయని దీనిపై జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. వీటిని పరిశీలన చేసి అక్రమాలు రుజువైతే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. అక్రమ లేఔట్లు వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవడంతో పాటు 10 శాతం భూమి ప్రభుత్వానికి ఇవ్వాలని, 33 శాతం రోడ్లు వేయాలన్నారు. ఆమోదం పొందిన ప్లాన్ ప్రకారం లేఅవుట్లు వేయాలన్నారు. దీనిలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో అన్ని ప్రాంతాలలో లేఅవుట్‌లు వేయాలంటే అర్బన్ అథారిటీ అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం మాత్రమే లేఅవుట్లు వేయాలన్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు, రవాణాపై గట్టి నిఘా పెట్టాలని సూచించారు.

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందచేస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: పోలీస్ కుటుంబాలకు ఎల్లప్పుడూ అండంగా ఉంటామని ఎస్పీ యు.రవి ప్రకాష్ అన్నారు. నర్సాపురం ట్రాఫిక్ ఎస్సై వైవీ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెక్కులను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. అనంతరం ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, డీపీఓ ఏఓ రామ్మోహన్, అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, ట్రెజరర్ బి.ఏసు పాల్గొన్నారు.

ఆర్జేడీ మధుసూదనరావుకు ఎన్ఐఈపీఏ అవార్డుపై హర్షం



మధుసూదనరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల ఏలూరు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా పనిచేసిన పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ దుక్కిపాటి మధుసూదనరావు ప్రతిష్టాత్మకమైన ఎన్ఐఈపీఏ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్) అవార్డుకు ఎంపిక కావడం హర్షణీయమని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధత, కింది ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథం, ఉపాధ్యాయులతో మంచి మనసుతో ఉండడం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో చిత్తశుద్ధిగా వ్యవహరించడం మధుసూదనరావు ప్రత్యేకతలన్నారు. విద్యా వ్యవస్థలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రభుత్వ మన్ననలను పొందిన ఈ అవార్డుకు ఎంపిక చేయడం సముచిత నిర్ణయమన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



కార్యక్రమంలో పాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది

తాడేపల్లిగూడెం: చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల వార్షికోత్సవం–2023 పురస్కరించుకుని శనివారం వెంకటరామన్నగూడెం కేవీకేలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఆన్‌లైన్ పద్ధతిలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సదస్సును ఏర్పాటు చేయగా కేవీకేలో వీక్షించారు. భారతదేశం ప్రతిపాదించి, ఐక్యరాజ్యసమితి ఆమోదం పొందిన ఈ వేడుకను జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన విషయాన్ని ఆలకించారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు వీటిలో ఉంటాయని, మధుమేహం, గుండె సంబంధ అనారోగ్యాలు రాకుండా కాపాడతాయని ఈ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాశస్త్యం, చిరు ధాన్యాల సాగుపై కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాఘవేంద్ర రెడ్డి వివరించారు. శాస్త్రవేత్తలు కె.వెంకటసుబ్బయ్య, దేవీవరప్రసాదరెడ్డి, శాలిరాజు, దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ ఇంటినే స్నేహితులతో కలిసి దోచేశాడు

- నిడమర్రు దోపిడీ కేసులో నలుగురి అరెస్టు
- సొంత సోదరి కొడుకే ప్రధాన నిందితుడు
- రూ.30 లక్షల విలువైన బంగారు వస్తువుల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్‌దేశ్‌శర్మ



నిందితుల నుంచి రికవరీ చేసిన చోరీ సొత్తు

ఏలూరు టౌన్: జల్సాలకు అలవాటు పడి పాత నేరస్తులైన స్నేహితులతో కలిసి సొంత పెద్దమ్మను కత్తితో బెదిరించి బంగారు ఆభరణాలు దోపిడీ చేసిన కేసును నిడమర్రు పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. వివరాలను ఏలూరు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ వెల్లడించారు. చేబ్రోలుకు చెందిన కొమ్మిన శ్రీనుకు అన్నవరంలో రాజ్‌కుమార్ అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ చేస్తానని చెప్పి పరిచయం అయ్యాడు. వీరిద్దరూ గుప్త నిధుల కోసం తిరుగుతూ భారీగా డబ్బు ఖర్చు చేశారు. వీరిద్దరూ రియల్ ఎస్టేట్ పనిపై కాకినాడ వెళ్లగా సాయి రవికాంత్, అరుణ్‌కుమార్ పరిచయం అయ్యారు. వీరంతా పలు కేసుల్లో పాత నేరస్తులు. రవికాంత్, అరుణ్‌కుమార్‌పై హత్య, దొంగతనం, దోపిడీ కేసులు ఉన్నాయి. ఈ కేసుల్లో చాలా సార్లు జైలుకు వెళ్లారు. ఇక రాజ్‌కుమార్‌పై కోరుకొండ స్టేషన్‌లో డీజిల్ ఆయిల్ చోరీ కేసు ఉంది. కొంత కాలం జైలు శిక్ష అనుభవించాడు.

దోపిడీకి స్కెచ్ ఇలా..

రాజ్‌కుమార్‌కు డబ్బులు అధికంగా సంపాదించాలనే ఆశతో ఉన్నాడు. నిడమర్రులో తన పెద్దమ్మ జానకమ్మ ఉంటోంది. ఆమె కుమార్తె మంగ గల్ఫ్‌లో పనిచేస్తూ ఇండియా వచ్చినప్పుడల్లా బంగారం తెస్తుందని, పెద్దమ్మ వద్ద సుమారు కిలో బంగారం ఉండవచ్చని, పెద్దమ్మ వృద్ధురాలు కావటంతో సులువుగా దోపిడీ చేయవచ్చని మిగిలిన ముగ్గురికి చెప్పాడు. నలుగురూ ఫోన్‌లో మాట్లాడుకుని రెక్కీ చేశారు. ఈనెల 14న ఉదయం అక్క, బావలను మల్కీపురం తీసుకువెళతానని, పెద్దమ్మ ఒక్కరే ఇంట్లో ఒంటరిగా ఉంటుందని, ఆ సమయంలో దోపిడీ చేయాలని పథకం పన్నాడు. 14న ఉదయం 12.30 గంటల సమయంలో శ్రీను తన కారులో అక్క ధర్మవతి, మరో అక్క జ్యోతి, బావ ప్రభాకర్‌రావును ఎక్కించుకుని మల్కీపురం బయలుదేరాడు. తణుకు చేరుకుని రాజ్‌కుమార్‌కు ఫోన్ చేసి చెప్పాడు. ముగ్గురూ సాయంత్రం నారాయణపురం శివారులోని రెస్టారెంట్ సమీపంలో కారును పక్కనబెట్టి రాజ్‌కుమార్ పల్సర్‌బైక్‌పై శ్రీను పెద్దమ్మ ఇంటికి వెళ్లారు. ఇంట్లో జానకమ్మను అల్లుడి గురించి అడిగి నీరు ఇవ్వాలని అడగ్గా వృద్ధురాలు లోనికి వెళ్లటంతో వెనకాలే వెళ్లి ఆమె పీకమీద కత్తిపెట్టి అరిస్తే చంపేస్తామని బెదిరించారు. అనంతరం ఆమె మెడ, చేతులకు ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని, ఇంట్లోని ఇనుప బీరువా తెరిచి బంగారం మొత్తం బ్యాగులో వేసుకుని ముగ్గురు బండిపై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దోపిడీ చేసిన బంగారు ఆభరణాలను నలుగురు పంచుకుని, తిరిగి సరిపల్లి గ్రామం నుంచి ఉండి వైపు వెళుతుండగా పోలీసులు చాకచక్యంగా నిందితులను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. నిందితుల నుంచి మారుతీ సుజుకీ ఆల్టో కారు, బజాజ్ పల్సర్ మోటారు సైకిల్, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బ్యాగులు, ఒక బటన్‌నైఫ్‌తోపాటు, రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన చేబ్రోలు ఎస్సై కె.స్వామి, హెచ్‌సీ పీవీ సత్యనారాయణ, కానిస్టేబుల్స్ ఎస్.నాగరాజు, కె.భీమరాజు, కె.సత్యనారాయణ, హోంగార్డు పి.జగపతి, ఎం.నాగబాబు, మహిళా సంరక్షణ కార్యదర్శి పి.రాధికను జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏలూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, గణపవరం సీఐ ఎంవీ సుభాష్, నిడమర్రు ఇన్‌ఛార్జ్ ఎస్ఐ వీ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై దృష్టి పెట్టండి

సాక్షి, భీమవరం: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం భీమవరంలోని డాక్టర్ సీఎస్ఎన్, బ్రౌనింగ్ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ టీవీల వద్ద పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. అలాగే మెడికల్ క్యాంపులను పరిశీలించి అక్కడ ఓఆర్ఎస్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయా అంటూ ఆరా తీశారు. ఆమె వెంట భీమవరం మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావులేదు

ఉండి: ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా చూడాలని కలెక్టర్ పీ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష జరుగుతున్న సమయంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి సెంటర్‌కు ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాయాలి, ఎంతమంది హాజరైయ్యారు అనే విషయాలు ప్రతీరోజు పర్యవేక్షించాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతున్న పరీక్షల నిర్వహణను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.రవీంద్రకుమార్ ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు 97 శాతం హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం నిర్వహించిన ఇంగ్లిష్ –2 పరీక్షకు 106 కేంద్రాల్లో మొత్తం 32,538 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 10,728 మంది జనరల్ విద్యార్థులకు గాను 10,408 మంది హాజరు కాగా, 320 మంది గైర్హాజరయ్యారు. అలాగే 1,633 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 1,504 మంది హాజరు కాగా, 129 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 14,823 మంది జనరల్ విద్యార్థులకు గాను 14,522 మంది హాజరు కాగా, 522 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులకు గాను 1,530 మంది హాజరు కాగా 1,426 మంది 104 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలోని 15 కేంద్రాల్లో 4,099 మంది జనరల్ విద్యార్థులకు గాను 4,041 మంది హాజరుకాగా, 58 మంది గైర్హాజరయ్యారు. అలాగే 672 ఒకేషనల్ విద్యార్థులకు గాను 637 మంది హాజరుకాగా, 35 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద విద్యార్థుల హాజరు 97 శాతంగా నమోదైంది. ఈ పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం కరిచర్లగూడెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ దేవరపల్లి పవన్‌కుమార్ (38) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం జంగారెడ్డిగూడేనికి చెందిన పవన్‌కుమార్ భీమోలు గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. శనివారం విధులు ముగించుకుని జంగారెడ్డిగూడేనికి కారులో వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్‌కుమార్ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వాకు వరుణుడి దెబ్బ

- ఉష్ణోగ్రతల్లో ఒక్కసారిగా మార్పులు
- ఆక్వా చెరువులకు ఆక్సిజన్ లేమి ముప్పు


ఆక్సిజన్ లెవెల్ చేయడానికి చెరువుల్లో ఏరియేటర్లు తిప్పుతున్న దృశ్యం

కైకలూరు : నిన్నటివరకు మండు వేసవిని తలపించేలా ప్రతాపం చూపిన భానుడికి నీలిమేఘాలు అడ్డుపడ్డాయి. శుక్రవారం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. మామూలుగా అయితే ఏడాది మార్చి ప్రారంభం నుంచే ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఒకేసారి వాతావరణం చల్లబడడంతో వాతావరణ మార్పుల వల్ల చేపలకు ఆక్సిజన్ లేమి సమస్య ఏర్పడుతుందని ఆక్వా రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మరోపక్క చేపల, రొయ్యల చెరువులు పట్టుబడి దశలో ఉన్నాయి. ఈ సమయంలో ఆక్సిజన్ సమస్య తలెత్తితే రూ.కోట్లలో నష్టపోతామని రైతులు మదనపడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చేపల, రొయ్యల సాగు జరుగుతోంది. ఇప్పటికే సగం మంది రైతులు పట్టుబడులు చేసుకున్నారు. మరికొందరు పట్టుబడులకు సిద్ధమవుతోన్నారు. ఇలాంటి సమయంలో వాతవరణం రైతులను భయపెడుతుంది. ఇప్పటికే చేపల చెరువులను పేను, శంకుజలగ, రెడ్ డిసీజ్ వంటి వ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా రొయ్యల చెరువుల్లో వైట్ వైరస్ రైతులను మరింత వేధిస్తుంది.

ఏటా ఇదే సమస్య

దేశంలోనే ఆక్వా ఉత్పత్తులలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలుస్తోంది. అందునా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా ఎగుమతుల్లో మొదటి స్థానాన్ని దక్కించుకుంటుంది ఇప్పటి వరకు ఎండలు మండిపోయి ఒక్కసారిగా వర్షం కురిస్తే చెరువుల అడుగభాగాన ఉన్న విషరసాయనాలు ఒక్కసారిగా పైకి రావడం వల్ల ఆక్సిజన్ అందక చేపల మృత్యువాత పడే సమస్య ప్రతి ఏటా వేధిస్తుంది. ఈ మేరకు జిల్లాల్లో ప్రతి ఏడాది రూ.90 కోట్ల వ్యాపారంపై ప్రభావం పడే అవకాశం ఉంది.

ఆక్సిజన్ సమస్యకు సూచనలివే



చేపల చెరువుల్లో ఆక్సిజన్ లేమి కారణంగా అనేక మంది రైతులకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని కైకలూరు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఎస్.భవిత చెప్పారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు సంభవించినప్పుడు పాటించాల్సిన పద్ధతులను ఆమె వివరించారు.

- వర్షం పడుతున్న సమయంలో ఆక్సిజన్ టాబ్లెట్, పౌడర్ చెరువుల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలి
- వర్షం పడిన తర్వాత ఉప్పు 50 కేజీలు, 10 కేజీలు పొటాష్ ఒక ఎకరానికి పిచికారీ చేయాలి.
- మేతలు, రసాయనిక పురుగుమందులు చెరువుల్లో వాడకూడదు
- చెరువులో ఆక్సిజన్ ఉత్పత్తి చేయడానికి బోటును కలియతిప్పాలి.
- ముఖ్యంగా చేపల పట్టుబడులు నిలిపివేయాలి.
- నీటి, మట్టి పరీక్షలు వెంటనే చేయించాలి.
- ఆక్సిజన్ లేవల్స్ తగ్గుతున్న నేపథ్యంలో రొయ్యల చెరువుల వద్ద ఫ్యాన్ సెట్స్ రిపేరు లేకుండా చూడాలి.
- రైతులకు ఇబ్బంది కలిగితే వెంటనే మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలి.

తీరంలో గంజాయి కలకలం

- దాదాపు 23 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన జిల్లా ఎస్పీ రవిప్రకాష్

నరసాపురం: నరసాపురం తీరంలో మరోసారి గంజాయి విక్రయాల జోరు కలకలం రేపింది. మొగల్తూరు, నరసాపరం పట్టణాల్లో శనివారం రూ.2.30 లక్షలు విలువైన 23.305 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 8 మందిని అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు మైనర్లు కూడా ఉన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ నరసాపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మొగల్తూరు మండలం శేరేపాలెంలో 216 జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ నిర్మానుష్య ప్రాంతంలో కొందరు గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్‌లుగా చేసుకుంటుండగా మొగల్తూరు ఎస్సై ఎం.వీరబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరాచారి తెలిపి ఆయన ఆదేశాల మేరకు నరసాపురం రూరల్ సీఐ కె.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో పాలకొల్లు మండలం జిన్నూరుకు చెందిన సవరపు బుజ్జి, నరసాపురం పట్టణం 3వ వార్డుకు చెందిన సంగాని క్రాంతిరాజు, కుమ్మరిపేటకు చెందిన లొట్టి శ్రీసాయి, శివకోడు పంచాయతీకి చెందిన ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ 2.10 లక్షలు విలువైన 21.305 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చింతపల్లికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు ఈ కేసులో అరెస్ట్ చేయాల్సి ఉందని ఎస్పీ వివరించారు. అలాగే నరసాపురం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో కాటన్‌పార్కు వద్ద పంట కాలువ పక్కన గంజాయి పంపకాలు సాగుతున్నట్టుగా వచ్చిన సమాచారంతో టౌన్ ఎస్సై కె.సుధాకర్‌రెడ్డి దాడి చేసి చిట్టవరం గ్రామానికి చెందిన ఏలూరి శ్యామ్‌సన్, నరసాపురం మండలం కె.నవరసపురం గ్రామానికి చెందిన బెరవ వెంకటేష్, చిట్టవరం గ్రామానికి చెందిన గొల్ల విక్రాంత్, మరో మైనర్‌ను అరెస్ట్ చేశారని చెప్పారు. ఈ నలుగురి నుంచి రూ.20 వేలు విలువైన 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అరెస్ట్ చేసిన వారిలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న పాత నేరస్తులు కూడా ఉన్నారని ఎస్పీ చెప్పారు. జిల్లాలో గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో టౌన్ సీఐ జి.శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు


మణిశంకర్ (ఫైల్)

ఆగిరిపల్లి: బీటెక్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.చంటిబాబు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కైకలూరుకు చెందిన పువ్వుల మణిశంకర్ (21) మండల పరిధిలోని పోతవరప్పాడు ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతూ ఫ్రెండ్స్‌తో కలిసి ఓ రూమ్‌లో ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం నుంచి మణిశంకర్ కనబడకపోవడంతో తోటి విద్యార్థులు విద్యార్థి తండ్రికి సమాచారం అందించారు. దీంతో తండ్రి రవికుమార్ శనివారం పోలీసులను ఆశ్రయించాడు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

ఏలూరు(మెట్రో): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, ఆర్థిక స్థాయి కమిటీ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్యా, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం పనుల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, పెనుమాల విజయబాబు, ఆయా కమిటీ సమావేశాలకు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మంచినీటి అవసరాలపై జరిగిన సమావేశంలో వేసవిలో నీటిఎద్దడి లేకుండా అవసరమైన పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు జెడ్పీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు వారి వారి మండలాల్లో ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వాటికి అవసరమైన నిధులు కేటాయింపునకు జెడ్పీ దృష్టికి తీసుకువస్తే కచ్చితంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లాలో రూ. 63.14 లక్షలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సంతృప్తి

రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో అధికారుల పనితీరు అభినందనీయమని పలువురు జెడ్పీటీసీ సభ్యులు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ చిన్న సమస్య వచ్చినా వాటిపై అధికారులు స్పందించిన తీరు ప్రసంశనీయమన్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో సొమ్ము చెల్లింపులు చేశారన్నారు. ప్రస్తుత రబీలో ధాన్యం కొనుగోలు మరింత మెరుగైన చర్యలు చేపట్టి రైతులకు మేలు చేయాలన్నారు. ముందుగానే మిల్లర్ల నుంచి అవసరమైన మేరకు గోనె సంచులను సేకరించి రైతులకు అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై. రామకృష్ణ జెడ్పీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఖరీఫ్ లో ఏలూరు జిల్లాలో 200 రైతు భరోసా కేంద్రాల ద్వారా 3,05,205 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 39,387 మంది రైతుల నుండి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రబీలో రైతులకు ఎలాంటి కొరత లేకుండా 277 రైతు భరోసా కేంద్రాల్లో 1858 మెట్రిక్ టన్నులు ఎరువులు నిల్వ చేశామన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా 1250 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఇంతవరకు 2,36,148 ఎకరాల్లో (98.3శాతం) ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు. రైతు భరోసా-పీఎం కిసాన్ కింద 2022-23 సంవత్సరంలో మూడు విడతలుగా 1,95,707 మంది రైతులకు రూ.264.20 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశామని వివరించారు. ఉపాధిహామీపై జరిగిన చర్చలో కూలీలకు మార్చి 9 వరకూ వేతనాలు జమ చేయడం చేశామని సభ్యులకు డ్వామా అధికారులు వివరాలు తెలియజేశారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు రమణ మృతి


గరగ వెంకటరమణ

పెంటపాడు: మండలంలోని పడమరవిప్పర్రు గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు గరగ వెంకటరమణ (90) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొంతకాలంగా ఈమె అనారోగ్యంగా ఉండటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. భర్త గరగ లక్ష్మీనారాయణతో కలిసి ఈమె స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పని చేయడంతో ఆమెను కొన్ని రోజులు రాజమండ్రి, బళ్లారి జైలులో ఉంచారు. భర్తతో కలిసి ఉద్యమంలో పాల్గొన్నందున ఆమెను కూడా సమరయోధురాలిగా ప్రభుత్వం గుర్తించింది.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం


అనివేటి మండపం వద్ద భక్తుల రద్దీ ఇలా

ద్వారకాతిరుమల : చినవెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి వారం వేలాదిగా భక్తులు శ్రీవారిని దర్శిస్తారు. అయితే ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతుండటంతో పాటు, తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తుండటంతో క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య బాగా తగ్గింది. దాంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంతం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాల వద్ద భక్తుల సంచారం నామమాత్రంగానే ఉంది.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు


వై. రామకృష్ణ

ఏలూరు(మెట్రో): జిల్లాలో ప్రస్తుతం వరి పంట అంకురం ఏర్పడే దశ నుండి పాలు పోసుకునే దశ వరకు ఉందని, కావున రైతాంగం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 90,850 ఎకరాలలో వరి పంట సాగు చేశారని ఎక్కువగా ఎంటీయూ 1121 వరి రకం సాగు చేయడం వల్ల కోతలకు చాలా సమయం ఉందని ఆందోళన వద్దని భరోసా ఇచ్చారు. అలాగే జిల్లాలో మొక్కజొన్న 71,300 ఎకరాలలో సాగులో ఉందని, ప్రస్తుతం మొక్కజొన్న పంట గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో ఉన్నందున మొక్కజొన్న కోతను వాయిదా వేసుకోవాలని రైతులను ఆయన కోరారు. ఇప్పటివరకూ ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, లింగపాలెం మండలాలల్లో 250 ఎకరాలలో మొక్కజొన్న నేలకొరిగిందని పేర్కొన్నారు.

4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

వాతావరణ మార్పులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3వ రోజు కూడా మేఘావృతమై ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెదురు, మదురు వర్షాలతో పాటుగా, ఓ మోస్తరు. వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలో సుమారు 4 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. ఆదివారం కూడా వాతావరణం ఇలాగా ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు.

హేలాపురి కళాశాలలో సౌత్ సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్


వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలోని వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జేఎన్‌టీయూ (కాకినాడ)సౌత్ సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయని కళాశాల ఏఓ టీ.కరుణానిధి, మేనేజింగ్ ట్రస్టీ సమీర్ అన్నారు. శనివారం కళాశాలలో ప్రిన్సిపల్ రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జేఎన్‌టీయూ సౌత్ సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 70 టీమ్‌ల ఇంజనీరింగ్‌కళాశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఇప్పటి వరకు 40 టీంలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరించారు. పోటీలు వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల , ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సివిల్ హెచ్‌ఓడీ తేజ, అకౌంటెంట్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లంచం కోసం బీపీఎంపై వేధింపులు


రామన్నపాలెంలో పోస్ట్ మాస్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సంఘ నాయకులు

మొగల్తూరు: బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌ను లంచం కోసం వేధింపులకు గురి చేస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్‌పై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ సంఘ అధ్యక్షుడు బీవీ రావు డిమాండ్ చేశారు. శనివారం సంఘ నాయకులు రామన్నపాలెం పంచాయతీ ఆకనవారితోట పోస్టాఫీసుకు వచ్చి సంబంధిత బీపీఓ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్‌లో ఆకనవారితోట బీపీఓగా బాధ్యతలు స్వీకరించిన బి.ప్రసన్న మౌనికను అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ డి.అనిల్ అంబేడ్కర్ తనకు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారని వివరించారు. ఆమె ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి 23న ఆకనవారితోట కార్యాలయాని వచ్చి టేబుల్ సొరుగులో ఉన్న రూ.25 వేలు నగదును అనిల్ అంబేడ్కర్ తీసుకెళ్లిపోయారన్నారు. ఈ విషయంపై భీమవరంలోని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ పి.బాలసుబ్రహ్మణ్యానికి ఫిబ్రవరి 24న మౌనిక ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అంబేడ్కర్ సన్నిహితులంటూ కొంత మంది వచ్చి ఆమెను బెదరించడమే కాకుండా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అనిల్ అంబేడ్కర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుమల రావు, శ్రీధర్ బాబు, యూవీ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 30 కేసుల రాజీ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో మొత్తం 30 కేసులను రాజీ చేశామని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 బెంచీలను ఏర్పాటు చేసి రూ.62.20లక్షలు మనోవర్తిని ఇప్పించామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరు గ్రామంలో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామి వారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి తెల్లవారు జామున సుప్రభాతసేవ, తోమాల సేవ జరిపారు. ఉదయం అర్చనలు జరిపి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేసారు.

దండగర్రలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



దండగర్ర గ్రామంలోని కనకదుర్గమ్మ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర కనకదుర్గమ్మవారి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాలను గ్రామస్తులు తిలకించారు. ధ్వజస్తంభ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్త బండి పీరేశ్వరరావు తన తల్లి బండి జగన్మోహిణి జ్ఞాపకార్థం రూ.1.50లక్షలను అందజేసినట్లు గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


తగాదాలతో జీవితాలను పాడుచేసుకోవద్దు



లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ):కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని, చిన్న, చిన్న తగాదాలతో సంసారాలను నాశనం చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో మూడు కేసులను పరిష్కరించి మనోవర్తి నిమిత్తం 15,00,000 పరిష్కారం చూపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఆడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.రమ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.నాగమల్లేశ్వరీ, న్యాయవాదులు, కక్షిదారులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో భారీ వర్షం



తాడేపల్లిగూడెంలో శనివారం రాత్రి వర్షం కురుస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలో శనివారం రాత్రి ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి అడపా దడపా వర్షం పడుతూనే ఉంది. అయితే, రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ తడిసి ముద్దయ్యాయి. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు వేసవి తాపం నుంచి ప్రజలు సేదతీరుతున్నారు.

వైభవంగా బలుసులమ్మ తల్లి గరగల సంప్రోక్షణ



విశేష అలంకరణలో బలుసులమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది ఉత్సవాలు మొదటి రోజు సందర్భంగా శనివారం ఉదయం పట్టణ ఇలువేల్పు బలుసులమ్మ తల్లి ఆలయం వద్ద డాక్టర్ శశికుమార్, శైలజ దంపతులచే గణపతి పూజ గో పూజ, పుణ్యావాచనం, తదితర విశేష పూజలు జరిగాయి. ఆలయ రజక ఆసాదులుచే పెద్ద శివాలయం ఏలూరు కాలువ వద్ద గరగల సంప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మత్వంలో కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, వైస్ చైర్మన్ వట్టిపోలు రాము, నున్న రంగనాయకులు, తదితరులు పర్యవేక్షించారు.

అకాల వర్షం...రైతుకు నష్టం

- వర్షం గుబులు... రైతు దిగాలు
- ద్రోణి ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు



తణుకులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం



ఈనికదశలో ఉన్న వరి చేలు

తణుకు: అకాల వర్షం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తణుకు నియోజకవర్గ వ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. శుక్రవారం ఉదయం నుంచి వాతావరణంలో చోటు చేసుకున్న మార్పు సాయంత్రం నుంచి వర్షం ప్రారంభం అయ్యింది. శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కోస్తాంధ్రపై ఏర్పడిన ద్రోణి ప్రభావంతో వర్షానికి తోడు తీవ్రమైన చలి గాలులు వీస్తున్నాయి.

అన్నదాతల వెన్నులో వణుకు...

ప్రస్తుత రబీ సీజన్‌లో తణుకు నియోజకవర్గంలో సుమారు 45 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. చేతికి అందివచ్చిన పంట ఎక్కడ నోటికి దక్కకుండా పోతుందోనన్న భయం వెంటాడుతోంది. వర్షాలకు పంట నాణ్యత దెబ్బతిని, ధర పడిపోయే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వాతావరణంలో ఆకస్మిక మార్పులతో వరి చేలు తెగుళ్లబారిన పడే అవకాశాలు ఉన్నాయిని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. వరి గింజ పాలు పోసుకుని లేదా గట్టిపడే దశలో ఉన్న చేలు కొద్ది పాటి గాలులు, వర్షాలకు విరిగిపోయే ప్రమాదం ఉందని రైతులు కలత చెందుతున్నారు. వర్షాలు కురిసినప్పటికీ ఈదురుగాలులు లేకపోవడం కొంత ఉపశమని వారంటున్నారు.

వ్యాధులతో జాగ్రత్తలు...

అకాల వర్షాలు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకపక్క చలి గాలులు... మరోపక్క వర్షాలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భిన్నవాతావరణం నెలకొనడంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడం ఆందోళనకు గురి చేస్తోంది.

బాలాలయంలో లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



శ్రీలక్ష్మీనరసింహస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు పురాతన లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆలయ పునః నిర్మాణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి వారి విగ్రహాన్ని బాలాలయంలో అంగరంగ వైభవంగా ప్రతిష్ఠించారు. ఆలయ ఈఓ సృజన్, ఆలయ కమిటీ చైర్మన్ కల్లి శ్రీను, సభ్యులు చామన ప్రసాద్, పెనుగొండ సత్యవతి, ఆంజనేయులు, ఆలం పార్వతి, కుమార్ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు సుందర రామానుజచార్యులు బ్రహ్మత్వంలో గో పూజలు జరిగాయి.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వెంకట్రామన్నగూడెం జిల్లా పరిషత్ హైస్కూలులో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ కార్యకర్త కె.దీన స్వరూప రాణి అన్నారు. శనివారం మండలంలోని వెంకట్రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త స్వరూపరాణి మాట్లాడుతూ వివాహ వయస్సుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 19 ఏళ్లు నిండిన బాలికలకు మాత్రమే వివాహాలు చేయాలన్నారు. లేకుంటే పుట్టబోయే బిడ్డలపై ఆ ప్రభావం ఉంటుందన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త టి.గంగారత్నం, ఉపాధ్యాయులు ఎస్.విజయలక్ష్మమ్మ, వి.పద్మినికుమారి, కె.జయలక్ష్మి,ఎస్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: మైనర్ బాలికలకు వివాహం చేస్తే అత్యాచారం కేసులు నమోదు చేస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు, మండపాక గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో కిషోరీ బాలికలకు నిర్వహించిన వివాహ వయస్సు అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోరీ బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

బాలికలు జీవిత లక్ష్యాలను సాధించాలి



వరిఘేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: బాలికలు పాఠశాల దశలో జీవిత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే వరకు శక్తివంచన లేకుండా పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. అత్తిలి మండలం వరిఘేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ బాలికలలో శారీరక, మానసిక ఎదుగుదల లేకుండా వివాహాలు చేయడం చట్ట ప్రకారం నేరమన్నారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో వివిధ రంగాల్లో ఉన్నత పదవుల్లో స్థిరపడాలన్నారు. బాలికలు అన్ని రంగాలలో ముందుకువెళ్లి, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె రామకృష్ణయ్య, మహిళా సంరక్షణ అధికారిణి వై సత్యశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలను చెల్లించాలి



అరుళ్ల గ్రామంలో ఉపాధి హామీ పని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అరుళ్ళ గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీ రూ.600లు చెల్లించాలని, రెండు వందల పనిదినాలు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి నిధులు అధికంగా కేటాయించాలని, తగ్గించిన నిధులను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మానుకొండ నాగేశ్వరరావు, చదలవాడ తాతయ్య, మాంద్రు కుమారి, అవతారం, పోలాస మావుళ్ళు, మాన్యం సత్యనారాయణ, ముమ్మిడివరపు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వెంకట్రామన్నగూడెం హార్టీకల్చరల్ యూనివర్శిటీలో శనివారం మండల లీగల్ సర్వీస్ అథారిటీ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన, లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం జరిగింది. మహిళా సాధికారత, విద్యాహక్కు చట్టం, ర్యాగింగ్ వంటి విష సంస్కృతికి దూరంగా ఉండాలని, బాల్య వివాహాలు నిరోధించాలని అంశాలపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా భవానీలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాన్ని కూడా పెంచుకోవాలని, పలు అంశాలలో యువత తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని పలు సూచనలు చేశారు. కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీలో నిరుద్యోగులకు నైపుణ్యశిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న వాసవీ ఇంజనీరింగ్ పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంటు సుబ్బారావు

తాడేపల్లిగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణను అందించనున్నామని పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంటు చలంచర్ల సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ పథకం గురించి సమీప గ్రామ సచివాలయాల వలంటర్లీకు అవగాహన కల్పించారు. కేంద్రం ఆధీనంలోని స్కిల్‌డెవలప్‌మెంటు కార్పొరేషన్ ద్వారా 240 మంది గ్రామీణ నిరుద్యోగులకు ఐదు రకాల ట్రేడ్‌ల్లో నైపుణ్య శిక్షణను అందించడానికి కళాశాలకు అనుమతి వచ్చిందన్నారు. పెదతాడేపల్లి, రామన్నగూడెం, వెంకటరామన్నగూడెం, జగ్గన్నపేట, చినతాడేపల్లి, కడియద్ద గ్రామాల్లో వివిధ కారణాలతో చదువుఆపేసి, చదువుకొని ఖాళీగా ఉంటున్న నిరుద్యోగులకు ఈ శిక్షణను అందించడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. పూర్తిగా ఉచితంగా అందించే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం కో ఆర్డినేటర్ సుధారాణి, కళాశాల పరిపాలనాధికారి నారాయణరావు, సచివాలయాల వాలంటీర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో చెరువుల సుందరీకరణ

తణుకు టౌన్: తణుకు నియోజకవర్గంలోని గ్రామాల్లో గల మంచినీటి చెరువులను అమృత్ సరోవర్ పథకంలో సుందరీకరణ చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను ఈనెల 20వ తేదీ లోగా అందజేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో తణుకు నియోజకవర్గ స్థాయిలోని జాతీయ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ సరోవర్ పథకంలో మొదటి విడతగా తణుకు మండలంలో ఆరు చెరువులను రూ. 50 లక్షలు, ఇరగవరం మండలంలోని 12 చెరువులను రూ. 80 లక్షలు, అత్తిలి మండలంలో 9 చెరువులను రూ. 60 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటికి పనులకు సంబంధించి ప్రతిపాదనలను సోమవారం నాటికి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు అందజేయాలని జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది కోరారు. రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాల మేరకు గ్రామాల్లోని చెరువుల సుందరీకరణ పనులను పంచాయితీ సహాయ, సహకారాలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల ఎంపీడీవోలు, జాతీయ ఉపాది హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



తణుకు ఏపీ సీడ్స్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

తణుకు: ఎక్కడా లేని విధంగా తణుకు సీడ్స్ కార్యాలయం పరిధిలో టెండర్ విధానం ఎందుకు ప్రవేశపెట్టారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అడ్డగర్ల అజయకుమారి ప్రశ్నించారు. శనివారం స్థానిక ఏపీ సీడ్స్ సంస్థ ఎదుట మూడో రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలపారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడుతూ మూటలు మోసుకుని జీవనం సాగిస్తున్న వారి పొట్టలు కొట్టడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. కార్మికుల ఉపాధి పోగొట్టే చర్యలు అధికారులకు మంచిది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, నాయకులు టి.రామకృష్ణ, జి.త్రిమూర్తులు, వెంకటరమణ, వరలక్ష్మి, రూతమ్మ, శ్రీహరి, సాంబశివరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపండి

ఉండి : భవిష్యత్‌లో చిరుధాన్యాలు శాసించబోతున్నాయని, కావున చిరుధాన్యాల సాగుపై రైతులు ఎక్కువగా దృష్టి పెట్టాలని కృషీ విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ మల్లిఖార్జునరావు అన్నారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని కేవీకేలో శనివారం చిరుధాన్యాల సాగుపై శాస్త్రవేత్తలు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్ దెబోరా మెస్సియానా, డాక్టర్ వినయలక్ష్మి పాల్గొన్నారు.

అయిభీమవరంలో ముగిసిన జాతర

ఆకివీడు : అయిభీమవరంలో గ్రామ దేవతలు వీర్లంకమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల జాతర శనివారం ముగిసింది. వారం రోజుల పాటు గ్రామంలో జాతర కార్యక్రమాలు జరిగాయి. ఆఖరి రోజు అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో పలు శక్తి వేషాలు, గరగ నృత్యాలు, వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివారం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పిస్తారని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు జనతా ఆసుపత్రిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం కడకట్ల జనతా ఆసుపత్రిలో నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు, అవసరమైనవారికి కళ్ల జోడ్లు అందజేత తదితర సేవాలు ఉంటాయని వెల్లడించారు. పట్టణ పరిసర ప్రాంతాల వాసులు నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పంచారామ క్షేత్రంలో వివాహ మండపాల లైసెన్స్‌కు వేలం

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరంలోని పంచారామ క్షేత్రం శ్రీ ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో వివాహాది శుభకార్యాలకు వివాహ మండపాలు వేసుకొను లైసెన్సుకు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించినట్లు ఈఓ ఎన్.అరుణ్‌కుమార్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేది వరకూ రెండేళ్ల కాలపరిమితికి ఈ టెండర్ వర్తింస్తుందన్నారు. టెండర్ కమ్ బహిరంగవేలం నిర్వహించగా అనిశెట్టి మురళీ కృష్ణ మొదటి ఏడాదికి రూ.4,52,000కు, రెండో సవత్సరానికి రూ.4,97,200కు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు నాచు శ్రీ వల్లి, నల్లం రఘుబాబు, లక్కు త్రిమూర్తులు, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ, వర్థినీడి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

సాక్షి, భీమవరం : ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులు తీసుకురావాలని స్వేచ్ఛ ఫౌండేషన్ ఏపీ జనరల్ సెక్రెటరీ శ్రీపతి రాయ్ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ అప్లికేషన్ అనే అంశంపై ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం సిలబస్‌కే పరిమితం గాకుండా నూతన టెక్నాలజీని ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ గూగుల్ సర్టిఫికెట్ కోర్స్‌కు తమ కళాశాలను ఎంపిక చేయడం ఆనందదాయకమని ఈ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి గూగుల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు ఇంటర్న్‌షిప్ వంటి అవకాశాలు కూడా లభిస్తాయని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్, అసోసియేట్ ఎంకే కామేశ్వరరావు, పి.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గంలో 8 సెంటర్‌ల్లో శనివారం ప్రశాతంగా జరిగాయి. పట్టణంలో శ్రీ వాసవి, ఆదిత్య, ప్రగతి, జీఎంఆర్, శశి, చైతన్య, గోయెంకా ఉమన్స్ కళాశాల, పెంటపాడు జూనియర్ కళాశాల పరీక్షలు నిర్వహించారు. జనరల్, వోకేషనల్ విద్యార్థులు 2,429 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,377 మంది పరీక్షలు రాశారు.

తణుకులో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

తణుకు: భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో తణుకులో రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పి.వాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్రంలో విద్యారంగంపై సమస్యలను చర్చించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఈ సమావేశాలకు ఎస్ఎఫ్ఐ నాయకులు హాజరవుతారని అన్నారు. ఎస్ఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షుడు వీపీ సాను ముఖ్యఅతిథిగా హాజరవుతారని వాసు పేర్కొన్నారు.

నేత్రపర్వంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపన పూజలు



అత్తిలి శ్రీకనకదుర్గమ్మ ఆలయ శిఖర ప్రతిష్టాపన పూజలు చేస్తున్న దృశ్యం

అత్తిలి: స్థానిక కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం నేత్రపర్వంగా జరిగింది. గురు భవాని కాకర్ల త్రిమూర్తులు, విశాలాక్షి దంపతులచే శిఖర ప్రతిష్ఠాపన, చండీహోమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగసురేష్ శర్మ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, రంభ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: తుపాను ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఆర్ ఎస్.ప్రసాద్ సూచించారు. శనివారం మండలంలోని నవాబుపాలెం, కృష్ణాయపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి, రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వరి పంట గింజ గట్టి పడే దశలో ఉందని, వర్షాలు వల్ల తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రైతులు నీరు పోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుబ్బులు నేలకొరిగితే రెండు, మూడు దుబ్బులు కలిపి నిలబెట్టి కట్టాలని హితవు పలికారు. ఆయన వెంట వీపీఏలు, రైతులు ఉన్నారు.